తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
27 జూలై 2026

Follow :



# రోడ్లకు మహర్దశ

- అభివృద్ధిపై మంత్రి నిరంతర కృషి
- రూ. 264.53 కోట్ల నిధులు మంజూరు
- సింగల్‌లైన్ రోడ్లు ఇక డబుల్ లైన్

*సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం మునిపల్లి మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ వచ్చింది. మండలంలో ఉన్న సింగిల్ లైన్ రోడ్లను డబుల్ లైన్‌లుగా మారుస్తున్నారు. ఇందుకుగాను మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ ప్రత్యేక చొరవతో మండలంలో రూ.264.53 కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులతో పాటు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.*

**సంగారెడ్డిప్రతినిధి, జూలై 27 (జనంసాక్షి)**

మండలంలోని తాటిపల్లి-మక్తక్యాసారం రోడ్డు - రూ.22 కోట్లు, మునిపల్లి ఎక్స్ రోడ్డు-గార్లపల్లి ఎక్స్ రోడ్డు - రూ.30 కోట్లు, బుధేరా-సిరూర్ రోడ్డు - రూ.70 కోట్లు, కంకోల్-రాయికోడ్ చౌరస్తా రోడ్డు-రూ.33.00 కోట్లు, బుధేరా-మర్చల్లి రోడ్డు-రూ.2.78 కోట్లు, గార్లపల్లి హైలేవెల్ బ్రిడ్జి - రూ.19 కోట్లు, అల్లాపూర్ ఎక్స్ రోడ్డు-వయా బోడపల్లి, పెద్దలోడి, హస్నాబాద్, రోడ్డు-రూ.15 కోట్లు, పెద్ద చెల్మెడ-మాన్సాన్పల్లి బీటీ రెన్యువల్ రోడ్డు - రూ.1 కోట్లు, మునిపల్లి ఎక్స్ రోడ్డు-ఖమ్మంపల్లి బీటీ రోడ్డు-రూ.98 లక్షలు , ఖమ్మం పల్లి-చిన్న చెల్మెడ రోడ్డు-రూ.1 కోట్లు, మునిపల్లి-చందాపూర్ రోడ్డు-రూ.1.6 కోట్లు, చీలపల్లి ఎక్స్ రోడ్డు-కల్లపల్లి బేలూరు రోడ్డు- రూ.3 కోట్లు, మేళసంఘం ఎక్స్ రోడ్డు-మేళసంఘం రోడ్డు-రూ.1.8 కోట్లు, పెద్దలోని ఎక్స్ రోడ్డు పిల్లోడి గ్రామం రోడ్డు -రూ.2.6 కోట్లు, బోడపల్లి-పిల్లోడి బ్రిడ్జి - రూ.2.75 కోట్లు, బోడపల్లి-మాన్సాన్పల్లి మెటల్ రోడ్డు-రూ.60 లక్షలు, పిల్లోడి-గార్లపల్లి మెటల్ రోడ్డు - రూ.80 లక్షలు, ఖమ్మంపల్లి-పెద్ద చెల్మెడ మెటల్ రోడ్డు - రూ.80 లక్షలు, పెద్ద చెల్మెడ జిల్లా పరిషత్ పాఠశాల నూతన భవన నిర్మాణానికి రూ .కోటి 62 లక్షలు, మండలం లోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్డు -రూ.13 కోట్లు, లింగంపల్లి రెసిడెన్షియల్ పాఠశాల భవనానికి రూ.12 కోట్లు, బుధేరా ఉమెన్స్ కళాశాలలో వివిధ అభివృద్ధి పనులకు-రూ.8 కోట్లు, మునిపల్లి మోడల్ స్కూల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు, ఎస్సీ హాస్టల్ కంకోల్, మునిపల్లి వివిధ అభివృద్ధి పనులకు-రూ.50 లక్షలు, ఎస్సీ సబ్ ప్లాన్ సీఆర్ఆర్ వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు రూ.1.5 కోట్లు, కంకోల్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పీహెచ్సీ నిర్మాణం రూ.2.25 కోట్లు, మునిపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్లు, డ్వాక్రా భవనాలకు రూ.3.5 కోట్లు, మండలంలోని వివిధ గ్రామాల్లో స్కూల్ కాంపౌండ్ వాల్-రూ.3 కోట్లు, ఎల్‌వోసీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, హాస్పిటల్ లో డిస్కౌంట్ మునిపల్లి మండలంలో-రూ.7 కోట్లు, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం, ప్రతి గ్రామంలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నారు. మునిపల్లి మండలం లోని ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే కాకుండా విద్యా, వైద్యం కోసం ప్రత్యేక నిధులు మంజూరు, అభివృద్ధి లక్ష్యంగా మంత్రి దామోదర రాజనర్సింహ నిరంతరం కృషి చేస్తూ, అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నారు. మునిపల్లి మండలంలో, అందోల్ నియోజకవర్గానికి చరిత్రలో ఎవ్వరూ కేటాయించనన్ని నిధులు తీసుకొస్తూ అవసరమైతే ఇంకా నిధులు కేటాయించేందుకు కృషిచేస్తున్న విజనరీ లీడర్ మంత్రి దామోదర్ రాజనరసింహ కృతజ్ఞతలు తెలిపారు. మునిపల్లి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## మండలాభివృద్ధికి మంత్రి ప్రత్యేక కృషి

### మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి



గత బీఆర్ఎస్ సర్కారు రాష్ట్రంలో రోడ్ల నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. అనుకున్న స్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో పల్లె రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఈ విషయాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన వెంటనే స్పందించి రూ. 264.53 కోట్ల నిధులు మంజూరు చేశారు. పల్లెల్లో సింగిల్ రోడ్లను డబుల్‌రోడ్లుగా నిర్మిస్తే ప్రజల రవాణా ఇబ్బందులు తీరుతాయని మంత్రి భావించారు. వానాకాలంలో రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుంది .మండల అభివృద్ధి కోసం మంత్రి కృషి ఎనలేనిది.

## ప్రతి గ్రామానికీ రోడ్డు సౌకర్యం

### కాంగ్రెస్ మండల అధ్యక్షులు సతీష్ కుమార్



ప్రతి పల్లెకు బీటీ రోడ్లకు మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ సహకారంతో నిధులు మంజూరయ్యాయి. గ్రామాలకు సింగిల్ లైన్ రోడ్లను డబుల్‌లైన్లుగా మార్చుతాం. ఇప్పటికే మండలంలో మంత్రి కృషితో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. ప్రతి గ్రామానికి సంక్షేమ ఫలాలను అందిస్తున్నాం. అలాగే మహిళలకు సమైఖ్య సంఘాల భవనాలను కూడా నిర్మించేందుకు కృషి చేస్తున్నాం. మండల అభివృద్ధికి ప్రత్యేకంగా పాటుపడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ్మకు మండల ప్రజల తరుపున కృతజ్ఞతలు.

---

# 167వ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

## చెట్లు నాటుతున్న కూలీలపైకి దూసుకెళ్లిన కారు.. ముగ్గురికి తీవ్ర గాయాలు



**గండీడ్,జూలై 26 (జనంసాక్షి):** గండీడ్ మండలంలోని కొంరెడ్డిపల్లి-అంచన్పల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారి-167పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.రహదారి పక్కన చెట్లను నాటుతున్న కూలీలపైకి ఓ కారు అదుపుతప్పి దూసుకెళ్లడంతో ఈప్రమాదం చోటుచేసుకుంది.స్థానికుల కథనం ప్రకారం..వరంగల్ జిల్లాకు చెందిన,బాలాజీ నాయక్,విజయ్ నాయక్,విజ్జు బాయ్,బతుకుదెరువుకోసం గండీడ్ మండల167వ జాతీయ రహదారిపక్కల మొక్కలు నాటడానికి వచ్చారు.మొక్కలుకు కలుపు తీస్తుండగా,అదే తరుణంలో కొంరెడ్డిపల్లి వైపు నుంచి వచ్చిన ఓ కారు అదుపుతప్పి పనులు చేస్తున్న కూలీలను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు కూలీలకు కాళ్లు,చేతులు,నడుము భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.ఎముకలు విరిగినట్లు సమాచారం.వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.సమాచారం అందుకున్న 108అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ప్రాథమిక చికిత్స



అందించి,క్షతగాత్రులను మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి,ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ఆహా!! ఏమి.. రుచి

## తినరా మైమరచి.. చలో సంగారెడ్డి చౌరస్తా

**• చిరుతిళ్ళకు పెరిగిన డిమాండ్ • క్యూ కడుతున్న చిన్నాపెద్దలు**
**• పట్టణంలో ఇబ్బడిముబ్బడిగా చిరుదిన్ల బండ్లు • పట్టణంలో నిత్యం లక్షల్లో వ్యాపారం**

సంగారెడ్డి బ్యూరో, జూలై 26 (జనంసాక్షి)

"ఒరేయ్ ఎక్కడున్నావురా.. మన స్పాటి కి వచ్చేయ్.. అక్కడ ఏదో ఒకటి లాగించి.. అప్పుడు అలా అలా చక్కర్లు కొడదాం.. ఇదీ పట్టణంలో చాలా మంది మాట్లాడుకునే కోడ్ లాంగ్వేజ్.. ఆ స్పాట్ ఎక్కడుందో తెలుసా.. సంగారెడ్డి న్యూ బస్టాండ్.. సంగారెడ్డి ఎక్స్‌రోడ్.. బైపాస్ రోడ్డు లలో ఉండే తోపుడు బండ్ల వద్ద సాయంత్రం ఐదు దాటిం దంటే చాలు ఒకటే క్యూ.. ఎందుకంటే అక్కడ హాట్.. హాట్గా నోరూరించే తినుబండారాలు దొరుకుతుంది.. ఒక్కోటి నోట్లో పడుతుంటే అబ్బా.. మరొకటి వేయి అనాల్సిందే మరి.. అక్కడనే కాదు.. పట్టణంలో చాలా ప్రాంతాల్లో ఈ తోపుడు బండ్లు వెలిశాయి. ప్రస్తుతం పట్టణంలో బాగాఉన్న వ్యాపారం ఏదంటే అదే.. అందుకే ప్రతీ రోజూ పట్ట ణంలో ఉన్న 100 బళ్లపై సుమారు రూ. 3 నుంచి 4 లక్షల వరకు వ్యాపారం సాగుతుంది.. ఒక్కొక్క బండిపై రోజు సుమారు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వ్యాపారం నడుస్తున్నట్లు సమాచారం.

**సాయంత్రం యూత్ అడ్డా అక్కడే..**

సాయంత్రం ఐదు దాటిందంటే చాలు... ముక్కు పుటాలు అదిరిపోతాయి. కడుపులో కరకర లాడిపోతోంది.. ఏదో ఒకటి పడిపోవాల్సిందే... మిరపకాయ బజ్జీయో... అరటికాయ బజ్జీయో.. ఎగ్ బజ్జీయో.. అదీ కాదంటే హాట్ చాట్.. లేదంటే పానీ పూరి (గప్ చుప్).. నోటిలో పడిన వెంటనే కరిగిపోతూ.. కడుపులో పడాల్సిందే.. అబ్బా ఆ టేస్టే వేరు.. ఆ టేస్టే వేరు అనాల్సిందే.. అందుకే ప్రస్తుతం పోటీలేని వ్యాపారం ఏదంటే అదే.. కాస్త రుచిగా ఉంటే చాలు.. నిత్యం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్ నుండి మొదలు పెడితే పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు అలాగే బైపాస్ రోడ్డు, మల్కాపూర్ చౌరస్తా వరకు వందల సంఖ్యలో తినుబండారాల దుకాణాలు సాయంత్రం రద్దీగా ఉంటాయి. సాయంత్రం అయిందంటే యువకులు ఫ్రెండ్స్ తో కలిసి రోజు కూర్చునే స్థలానికి చేరుకుంటారు. రుచిని బట్టి ఎంత దూరం వెళ్లయినా తినొవస్తారు.. ప్రస్తుతం హాట్ చాట్ బండ్లకు, పానీ పూరీ, మిర్చి లకు ఉన్న డిమాండ్.. మరి ఏ వ్యాపారానికి లేదంటే అతిశయోక్తి కాదు.. అందుకే పట్టణంలో సుమారు 100 పైన బండ్లపై వ్యాపారం సాగుతోంది.

**సాయంకాలం సరదాగా..**

చిరుతిళ్ళకు డిమాండ్ పెరిగింది.. సాయంత్రం అయిందంటే చాలు మిక్చర్ బండ్ల వద్ద క్యూ కడుతున్నారు. మిరపకాయ బజ్జీలు, అరటికాయ బజ్జీలు, ఎగ్ బజ్జీలు, హాట్ చాట్ తదితరాలు లాగించేస్తున్నారు.. ఉదయం టిఫిన్.. సాయంత్రం మిక్చర్ కామనైపో యింది. దీనికి యువత, ఉద్యోగులు, గృహిణులు అందరూ అభిమానులే. సరదాగా సాయంత్రం సమయంలో అలా వచ్చి ఇలా తినివెళుతున్నారు. దీంతో ఈ బళ్ళకు ఎక్కడిలేని డిమాండ్ వచ్చిపడింది. అందుకే పట్టణంలో ఇబ్బడిముబ్బడిగా బండ్లు వెలుస్తున్నాయి.



అయినా వ్యాపారాలకు మాత్రం ఏం కొదువ ఉండడంలేదు. పట్టణంలో చూస్తే ఏ వీధిలో చూసినా అవే సాయంత్రానికి బండి నిండుగా బజ్జీలతో వచ్చి... రాత్రి 8 గంటలకల్లా ఖాళీ బళ్లతో ఇళ్లకు చేరతారు. ప్రస్తుతం పట్టణంలో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుంది.



### బతుకు బండి బాగానే ఉంది

**రమేష్, గప్‌చుప్ బండి వ్యాపారి,సంగారెడ్డి**



రోజుకు రూ. 3 నుంచి, 4 వేలు ఖర్చవుతుంది. ముడిసరుకు, వర్కర్ జీతాలు తీసివేసి రూ.8 నుంచి రూ .12 వందల వరకు మిగులుతుంది . బతుకు బండి బాగానే ఉంది. రోజు సాయంత్రం 4 గంటల నుండి 8 గంటలవరకు వ్యాపారం కొనసాగు తుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ వ్యాపారం తోనే కుటుంబం నడుస్తుంది.

### వ్యాపారం బాగానే ఉంది

**టిఫిన్ సెంటర్ వ్యాపారి యాదగిరి**



జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో గత కొన్ని సంవత్సరాలుగా బండిపై టిఫిన్, మిర్చి వ్యాపారం నిర్వహిస్తున్నాను. రోజు ఉదయం టిఫిన్ సాయంత్రం స్నాక్స్ విక్రయిస్తున్నాను. ఖర్చులు పోను రోజు రూ.12 వందల నుంచి రూ.15 వందల వరకు లాభం వస్తుంది. ఉన్నదాంట్లో ఊరికోసం.

## నీట్ పేపర్ లేకేజీలో ప్రజాస్వామ్యం గెలిచింది

- ఉద్యమ కళాకారుడు పొన్నాల అశోక్(డప్పు)

**కోహెడ, జూలై 27(జనంసాక్షి):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి యువకుల ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని అశోక్ అన్నారు. నెల రోజులుగా నడుస్తున్న విద్యార్థుల న్యాయమైన డిమాండ్లతో జరుగుతున్న పోరాటంలో ప్రజాస్వామ్యం గెలిచిందని తెలంగాణ ఉద్యమ కళాకారుడు పొన్నాల డప్పు అశోక్ ఒక ప్రకటనలో అన్నారు. ఈ పోరాటంలో నీట్ పేపర్ లీకేజ్ తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థి ఉద్యమాలకు ప్రజాస్వామ్యవాదులు, ప్రతిపక్ష పార్టీలు మద్దతుగా నిలిచి ప్రభుత్వాన్ని మేల్కొల్పారని అన్నారు. ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయమే అన్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం ప్రజా ఉద్యమాలు వర్ధిల్లాలని అయన నినదించారు.

## బోనాల మహోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు



**నారాయణఖేడ్, జూలై 26(జనంసాక్షి):** నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రి నగర్ కాలనీలోని మైసమ్మ అమ్మవారి ఆలయం, దత్తాత్రి కాలనీలోని మైసమ్మ అమ్మవారి ఆలయాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించిన బోనాల మహోత్సవాల్లో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలని ప్రార్థించారు. అలాగే సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబంలో సంతోషం, శ్రేయస్సు, ఐశ్వర్యం వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అభిషేక్ శెటాకర్, విజయ్ బుజ్జి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నగేష్ సేట్, మాజీ ఎంపీటీసీ ముజామిల్, నాయకులు అంజయ్య, సంజీవ్, ఇప్తారి సుదర్శన్, కాలనీ ప్రజలు, భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నత్తి అంబదాస్

**మెదక్ టౌన్, జులై 26,(జనంసాక్షి):** మెదక్ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై పార్టీ తరఫున పోరాటం చేస్తూ, రైతులకు అండగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాము. వరి ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకపోవడం, రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల కొరత లేదా యూరియాను అధిక ధరలకు విక్రయించడం, పంట నష్టం, పరిహారం, సాగునీటి సమస్యలు, అలాగే రైతులకు సంబంధించిన ఏ సమస్య వచ్చినా జిల్లా రైతు విభాగం అధ్యక్షులు శ్రీ నత్తి అంబదాస్ గారిని సంప్రదించాలని మెదక్ జిల్లా రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాము రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, మెదక్ జిల్లా రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తారని ఆశిస్తున్నాము.



## ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుల ఫిర్యాదు

**తెలకపల్లి, జూలై 26 (జనంసాక్షి):** మండల పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కించపరిచే పోస్టులు చేసిన మహమ్మద్ సిరాజ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల నాయకులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇన్‌చార్జి ఏఎస్ఐ శంకర్‌రెడ్డికి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో సామాజిక మాధ్యమాల్లో ప్రజాప్రతినిధులను కించపరిచే విధంగా పోస్టులు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ, సంబంధిత వ్యక్తిపై తగిన దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, రాజు, వెంకటేష్, బాబు, సాగర్, బిచ్చులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ సెంటర్‌ను ప్రారంభించిన ఎంపీ

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు







**సదాశివపేట, జూలై 26(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవగాహన, ముందస్తు నిర్ధారణ ద్వారా క్యాన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని అన్నారు.
శిశిర ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సింధుతో పాటు ప్రభుత్వ వైద్యులు,బీజేపీ పట్టణ అధ్యక్షులు ఓదెల రాజేశ్వరి,బీజేపీ మండల అధ్యక్షుడు కర్ణం ఆదిత్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్ రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోవూరి సంగమేశ్వర్, రాష్ట్ర నాయకుడు తోట చంద్రశేఖర్,జిల్లా నాయకులు శ్రీశైలం యాదవ్, పోల వెంకటేశం, సంగారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ కొండాపూర్ జగన్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు శివలింగం,నాయకులు శ్రీనివాస్,శ్రీశైలం, నామ హరీష్, ఉక్కిస భరత్, శ్రీకాంత్ రాజ్, గణపురం చంద్రశేఖర్, శ్రీనివాస్, కావలి అనిత, కావ్య,కార్యకర్తలు ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లీ బోనాలు

- అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలి
- సర్పంచ్ బందెల సుజాత - బాలకిషన్



**కోహెడ, జూలై 26 (జనంసాక్షి):** మండల కేంద్రంలో మాల సంఘం వారి ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ పోచమ్మ తల్లి బోనాల మహోత్సవానికి మాల కుల బాంధవులతో కలిసి స్థానిక సర్పంచ్ బందెల సుజాత– బాలకిషన్ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించి అనంతరం,అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం అధ్యక్షులు, ప్రతినిధులు కుల బంధువులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ పెద్దమ్మ మాత ఆలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

- ఆగస్టు 9న మహాబోనాల జాతర





**సంగారెడ్డి, జూలై 26 (జనంసాక్షి):** బీహెచ్ఈఎల్‌లోని శ్రీ పెద్దమ్మ మాత ఆలయంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఆషాఢ మాసం తొలి రోజు నుంచే ప్రత్యేక పూజలు, బోనాలు, తొట్టెల ఊరేగింపులు నిర్వహిస్తుండగా, రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతోంది. దీనికి అనుగుణంగా ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు మందిర అభివృద్ధి కమిటీ సభ్యులు మాణిక్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.
ఆగస్టు 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజులపాటు బోనాల జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఆగస్టు 7న ఉదయం 6 గంటల నుంచి పంచామృత, క్షీరాభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, బీహెచ్ఈఎల్ కర్మాగార ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఆగస్టు 8న అమ్మవారిని శాకాంబరీ మాతగా ప్రత్యేకంగా అలంకరించి సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆగస్టు 9న మహా బోనాల జాతర సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు బోనాల సమర్పణ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ పెద్దమ్మ మాత ఆశీస్సులు పొందాలని మాణిక్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# భారత సైన్యం దేశానికి గర్వకారణం

- కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి బ్యూరో, జూలై 26 (జనంసాక్షి):**
కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనపర్తిలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భారత సైనికులకు యావత్ దేశం రుణపడి ఉంటుందని అన్నారు. కొవ్వొత్తుల ర్యాలీల ద్వారా వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు.
కార్గిల్ విజయ్ దివాస్ భారత చరిత్రలో గర్వించదగ్గ రోజని, భారత సైనికుల ధైర్యం, త్యాగం, దేశభక్తికి ఇది చిరస్మరణీయ నిదర్శనమని అన్నారు. కార్గిల్ యుద్ధంలో బోఫోర్స్ గన్స్ కీలక పాత్ర పోషించాయని, వాటి సామర్థ్యాన్ని ఆ యుద్ధం ప్రపంచానికి చాటిచెప్పిందని పేర్కొన్నారు.
కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు ఘన నివాళులు అర్పిస్తూ, భారతదేశానికి రైతు, జవాన్ రెండు కళ్లు లాంటివారని, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన "జై జవాన్ – జై కిసాన్" నినాదం నేటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు.
యువతలో దేశభక్తి భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందని, దేశ సేవ చేయాలనే సంకల్పం ప్రతి యువకుడిలో ఉండాలని సూచించారు. సరిహద్దుల్లో మన సైనికులు నిరంతరం అప్రమత్తంగా ఉండటం వల్లే దేశ ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని చెప్పారు. కార్గిల్ యుద్ధం భారత సైన్యం పరాక్రమాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని, దేశ సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి కర్తవ్యమని అన్నారు.
దేశభక్తి అనేది మాటల్లో కాకుండా ఆచరణలో కనిపించాలని, అమర జవాన్ల ఆశయాలను కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని డాక్టర్ చిన్నారెడ్డి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, వనపర్తి జిల్లా ఏఐపీసీ అధ్యక్షుడు నాగార్జున, గోపాల్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరహరి, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, సీనియర్ నాయకులు మన్యం యాదవ్, ద్వారాపోగు విజయ్ బాబు, ఎస్.ఎల్. రమేష్, నందిమల్ల రామ్, వెంకటేష్, వెంకటన్న, సోషల్ మీడియా రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 27 నుంచి 29 వరకు రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాలు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ బ్యూరో, జూలై 26 (జనంసాక్షి):** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుండి 29 వ తేదీ వరకు జిల్లాలోని 12 రైతు వేదికల్లో విత్తన మేళా.కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వలన వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం ఈ విత్తన మేళా యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

తక్కువ నీరు – ఎక్కువ లాభం ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని సూచించారు.రైతులు సాంప్రదాయ వరిసాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగుచేస్తే వర్షాభావ పరిస్థితుల్లోనూ నష్టపోకుండా ఆర్థికంగా లాభపడవచ్చని సూచించారు. మేళాలో అందుబాటులో ఉండే నాణ్యమైన విత్తనాలు కంది, పెసర, మినుము, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు

**విత్తన మేళాలు నిర్వహించే 21 రైతు వేదికలు:** అల్లాదుర్గ్, రేగోడు, శంకరంపేట(ఏ), టేక్మాల్, కౌడిపల్లి, చిల్పిచేడ్, కుల్చారం, వెల్దుర్తి, మాసాయిపేట, నర్సాపూర్, శివంపేట్, మనోహరాబాద్, తూప్రాన్, మెదక్, హవేలీఘన్పూర్, పాపన్నపేట్, శంకరంపేట(ఆర్). చేగుంట, నర్సింగ్, నిజాంపేట, రామయంపేట మండల క్లస్టర్‌లలో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయదలచిన రైతులు తమ సమీప రైతు వేదికలను సందర్శించి, అక్కడ అందుబాటులో ఉండే వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సరైన విత్తనాలను పొందాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో ఈ



కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతులందరూ తేదీలు గుర్తుంచుకుని సమీప రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇట్టి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

# పాటతో పోరాట పిలుపు..

- సీపీఎస్ రద్దుపై ఉద్యోగ సంఘాల ఒత్తిడి



**సిద్దిపేట, జూలై 26(జనంసాక్షి):** సీపీఎస్ రద్దు అంశాన్ని మరోసారి ప్రజా చర్చల్లోకి తీసుకొచ్చే ప్రయత్నంగా పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో "నేస్తమా కదలిరా.. సీపీఎస్ రద్దుకై" అనే చైతన్య గీతం ఆవిష్కరించబడింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం సాంస్కృతిక రూపంలో సాగుతున్న ఈ ప్రచారం ఉద్యమానికి కొత్త ఊపునిస్తుందని సంఘం నాయకులు పేర్కొన్నారు.

సుమారు రెండున్నర లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభావితమవుతున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రూపొందిన ఈ గీతం ఉద్యమ భావజాలాన్ని ఉద్యోగుల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఉందని నాయకులు తెలిపారు.

గీత ఆవిష్కరణ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. సీపీఎస్ రద్దు అంశం మేనిఫెస్టోలో స్పష్టంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు నిర్ణయం తీసుకోకపోవడం ఉద్యోగుల్లో నిరాశ కలిగిస్తోందని పేర్కొన్నారు.

జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవన భద్రత కోసం ఓపీఎస్ అవసరమని అన్నారు. ప్రతి సీపీఎస్ ఉద్యోగి ఉద్యమంలో చురుకుగా పాల్గొని హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గీత రచయిత నీరడి లక్ష్మీనారాయణను ఈ సందర్భంగా నాయకులు అభినందించారు. చరిత్రలో అనేక ఉద్యమాలకు పాటలు స్ఫూర్తిగా నిలిచాయని, తెలంగాణ ఉద్యమం సైతం చైతన్య గీతాల ద్వారానే ప్రజల్లో విస్తృత మద్దతు సంపాదించిందని గుర్తు చేశారు. సీపీఎస్ రద్దు డిమాండ్ మళ్లీ బలంగా వినిపిస్తున్న తరుణంలో "నేస్తమా కదలిరా" గీతం ఉద్యమానికి సాంస్కృతిక శక్తిగా మారే అవకాశముందని అభిప్రాయపడ్డారు.

# ఇక్కడ ప్రవేట్ పాఠశాల నిబంధనలు నడవవు...

- ఆదివారం కూడా ప్రైవేట్ పాఠశాలల్లో తరగతులు
- ప్రవేట్ పాఠశాలలలో తనిఖీలు ఉండవు
- నిద్రావస్థలో విద్యాశాఖ
- ఆందోళన చేస్తున్న ప్రజా,విద్యార్థి సంఘాలు

**గద్వాల నడిగడ్డ, జూలై 26(జనంసాక్షి);** జోగులాంబ జిల్లాలో విద్యాశాఖ అమలు చేస్తున్నటువంటి నిబంధనలు ప్రైవేటు స్కూల్ యజమానులు ఖాతరు చేయరు. ఈ జిల్లాలో ప్రైవేట్ స్కూల్ యజమానులు చెప్పిందే విద్యాశాఖ అధికారులు వినాల్సి వస్తుందని ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్లే ఈ తతంగం అంతా నడుస్తుందని, ప్రైవేటు స్కూల్ యజమానుల ఆదేశాల మేరకే విద్యాశాఖ అధికారులు పనిచేస్తున్నట్లు ఇక్కడ తెలుస్తుంది. ప్రైవేట్ స్కూల్ యజమానులు విద్యాశాఖ అధికారులను శాసించే స్థాయికి చేరడం వల్ల జిల్లాలో ఆదివారం, సెలవు దినాలలో , రోజు ఉదయం 7 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు జిల్లాలో ప్రైవేటు స్కూలు నడుపుతున్న విద్యాశాఖ అధికారులు అటువైపు తొంగి చూడడం కూడా లేదని ఫిర్యాదు చేసిన కూడా ఉలుకు ,పలుకు లేదని ప్రజా,విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

**అయిజ మండల కేంద్రంలో...**

అయిజ మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆదివారం రోజున కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయని పి డి ఎస్ యు జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు హలింపాషా ఆరోపించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై అధిక ఒత్తిడి తీసుకొచ్చే విధంగా ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని, సెలవు రోజైన ఆదివారం కూడా విద్యార్థులను పాఠశాలలకు రప్పించడం ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని అన్నారు.ఈ నేపథ్యంలో పి డి ఎస్ యు నాయకులు అయిజ మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ప్రభుత్వం





నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించి, విద్యార్థుల హక్కులు మరియు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి సెలవు రోజు విశ్రాంతి కల్పించాలని సూచిస్తూ విద్యార్థులను వారి ఇళ్లకు పంపించారు. అలాగే పాఠశాల యాజమాన్యాలను ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు ఇలాంటి ఉల్లంఘనలపై ఇప్పటికైనా స్పందించి తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐజాలో ఠాగూర్ ప్రైవేట్ పాఠశాల,బ్రైట్ స్టార్ ప్రైవేట్ పాఠశాల, వి.ఆర్. ప్రైవేట్ పాఠశాల వీటిపై చర్య తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు మునిస్వామి, యునుస్, పవన్, జైశ్వంత్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మల్కాపూర్ గ్రామ అభివృద్ధిలో అధికారుల పాత్ర మరువలేనిది

- సర్పంచ్ ఆంజనేయులు గౌడ్



**తూప్రాన్, జూలై 26(జనంసాక్షి):** మల్కాపూర్ గ్రామ అభివృద్ధిలో అధికారుల పాత్ర మరువ లేనిదని మల్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ తెలిపారు. మండలంలోని మల్కాపూర్‌లో 411వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని వైకుంఠధామంలో చేపట్టారు. రెండు గంటలపాటు శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్ ను తొలగించారు. గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల సూచనలతో ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు జిన్న కృష్ణ, పిట్ల వేణు, రేఖ నాగరాజు గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు, మేకిన్ అధ్యక్షుడు కరుణాకర్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, యువత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీ చొరవతో బాధిత కుటుంబానికి రూ:3లక్షల ఆర్థికసాయం



**న్యాల్‌కల్, జూలై 26, (జనంసాక్షి):** గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో సతమతమవుతున్న బాధితుడికి స్థానిక ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.భాస్కర్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డిల చొరవతో ముఖ్యమంత్రి ఆర్థిక సహాయం రూ:3లక్షల ఎల్‌ఓసి పత్రాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. న్యాల్‌కల్‌కు చెందిన బాధితుడు బోడ నర్సింలు కుటుంబ సభ్యులకు ఆదివారం సహకార సంఘం చైర్మన్ సిద్ది లింగయ్య స్వామి, పార్టీ శ్రేణులు అడివప్ప, యూనుఖాన్, సత్యప్ప, మక్సుద్ నూర్ అలీషా, విజయ్, తదితరుల సమక్షంలో అందజేశారు. రూ.3 లక్షల ఎల్‌ఓసి అనుమతి పత్రాన్ని అందజేయడం పట్ల కుటుంబ సభ్యులు సుకీర్తమ్మ, మొగులయ్య గాయప్ప, తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

# కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి రైతు మృతి

- తల్పునూరు గ్రామంలో విషాదం
- భార్య బంగారమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు

**రేవల్లి, జూలై 26 (జనంసాక్షి):** కడుపునొప్పి భరించలేక పురుగుమందు తాగిన ఓ రైతు చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందిన ఘటన రేవల్లి మండలంలోని తల్పునూరు గ్రామంలో చోటుచేసుకుంది.



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తల్పునూరు గ్రామానికి చెందిన కోళ్ల బాలయ్య (39), తండ్రి పేరు బాలయ్య, కులం: ఎస్సీ–మాదిగ, వృత్తి వ్యవసాయం. ఇతనికి భార్య బంగారమ్మ, 9 నెలల పాప ఉన్నారు. శుక్రవారం తెల్లవారుజామున సుమారు 03 గంటల సమయంలో తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న బాలయ్య, నొప్పి తట్టుకోలేక ఇంట్లో ఉన్న పురుగుమందు తాగాడు.

కుటుంబ సభ్యులు గమనించి వెంటనే నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 01 గంటకు బాలయ్య మృతి చెందాడు. భార్య కోళ్ల బంగారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కగానొక్క కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్య, 09 నెలల పసిపాప అనాథలయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## తండ్రికి ఘన నివాళులు అర్పించిన మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి బ్యూరో, జూలై 26(జనం సాక్షి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి బడుగు బలహీన, దళిత వర్గాల అభ్యున్నతి కోసం శాసనసభ్యుడిగా, చట్ట సభల్లో సుదీర్ఘ పోరాటం చేసిన దార్శనికులు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తండ్రి కీ.శే. సిలారపు రాజనర్సింహ వర్ధంతి సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ ఘన నివాళులు అర్పించారు. మాజీ మంత్రి సిలారపు రాజనర్సింహ ప్రజలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, అందించిన సేవలు, పాటించిన రాజకీయ విలువలు, శాసన సభ్యులుగా, చట్టసభలలో ఆశయాలు, ముఖ్యంగా ఆందోల్ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం చేసిన కృషి చిరస్మరణీయం. 1967, 1972, 1978 సంవత్సరాల్లో వరుసగా మూడుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. బడుగు, బలహీన దళిత అట్టడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సుదీర్ఘకాలం ప్రజాసేవకు అంకితమై, ఆందోల్ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజానాయకుడు, దార్శనికుడు సిలారపు రాజనర్సింహలేని సేవలు, ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం. వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఘన నివాళులు అర్పించారు.

## నారాయణఖేడ్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు

- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి..



నారాయణఖేడ్, జూలై 26(జనం సాక్షి): ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో ఆదివారం నిర్వ హించిన బోనాల వేడుకల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 7వ వార్డు శాస్త్రినగర్ కాలనీలోని గడి మైసమ్మ ఆలయం, 5వ వార్డు దత్తాత్రేయ కాలనీలోని కట్ట మైసమ్మ ఆల యాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సేట్, రుక్మిణి గోపాల్ రెడ్డి, సుబూర్, మహేష్ చౌహాన్, విజయ్ బుజ్జి, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యుడు ముంతాజ్ సేట్, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి, శాతం దత్తు, మారుతీరావు, శంకర్ ముదిరాజ్, ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో వార్డులో చెత్త బుట్టల పంపిణీ



తూప్రాన్, జూలై 26(జనంసాక్షి): జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశాల మేరకు వార్డు సభ్యులు ఉత్తమ సొంత నిధులతో ప్రతి ఇంటికి తడి,పొడి చెత్త సేకరణకు చెత్త బుట్టలు పంపిణీ చేయాలనే ఆదేశాల మేరకు మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో వార్డు సభ్యులు సత్యనారాయణ, సలీం, రత్నమాల, వారి వార్డులో ఆదివారం నాడు సొంత నిధులతో తడిపొడి చెత్త సేకరణకు ఐదవ వార్డులో నాలుగు రకాల చెత్త బుట్టలుపంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిశుభ్రత దృష్టిలో పెట్టుకొని సహకరించాలని కోరారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పరిశుభ్రత పాటిస్తే రోగాల బారిన పడకుండా ఉంటామని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ఎల్లవేళల కృషి చేస్తున్నామని అన్నారు.

# విద్యారంగంలో పేరుకుపోతున్న సమస్యలు

- జోక్యం చేసుకోవాలని గవర్నర్‌కు వినతి
- సమర్పించిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



కొండపాక, జూలై 26(జనంసాక్షి): రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటి పరిష్కారానికి రాజ్‌భవన్‌ను ఆశ్రయించిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గవర్నర్ శివ ప్రతాప్ శుక్లకు సమగ్ర వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గురుకుల సిబ్బంది, ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై అవసరమైన ఒత్తిడి తీసుకురావాలని గవర్నర్‌ను కోరారు. ఉద్యోగ సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్న పీఆర్సీ అమలు, డీఏ బకాయిల విడుదల, పెన్షన్ సమస్యల పరిష్కారం వంటి అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఎస్ఎస్ఏ, కేజీబీవీ సిబ్బంది సమ్మె కాలపు వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మోడల్ స్కూల్ ఉద్యోగుల సమస్యలు కూడా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని వివరించారు. విద్యాశాఖలో జీవో-190 అమలు, సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ వంటి డిమాండ్లను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వివిధ పరిపాలనా, సేవా సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు గ్రాంట్లు విడుదల కాక పోవడంతో మౌలిక సదుపాయాల కల్పనలో ఆటంకాలు ఎదురవుతున్నాయని, హెల్త్‌ట్రస్ట్ పూర్తిస్థాయిలో అమలు కాక ఉద్యోగులు వైద్యసేవల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు వార్షిక క్యాలెండర్ ప్రకటించాలని, ప్రత్యేక టెట్‌లో ఎయిడెడ్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని, అన్ని గురుకులాల్లో ఏకరీతి పని వేళలు అమలు చేయాలని కోరారు. విద్యారంగం, ఉద్యోగ వర్గాల సంక్షేమానికి సంబంధించిన ఈ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గవర్నర్ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## భాస్కర్ రెడ్డిని పరామర్శించిన మైనంపల్లి



తూప్రాన్, జూలై 26(జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్రెడ్‌పల్లి భాస్కర్ రెడ్డి అమ్మ గారు ఉమ్మన్నగారి రాజమణి చనిపోవడం విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా... యువకుల సంబరాలు



కోహీర్, జూలై 26 (జనంసాక్షి): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడంతో సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో యువకులు, విద్యార్థులు ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. గత కొద్ది రోజులుగా యువత, విద్యార్థుల హక్కుల సాధనకై, న్యాయమైన డిమాండ్ల కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన సుదీర్ఘ నిరసనలకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అభిజిత్, దీప్తికేలతో పాటు కాంగ్రెస్ ఆయా పార్టీల మద్దత్తు కూడగట్టుకొని వారి నాయకత్వంలో యువత వెనకడుగు వేయకుండా చేసిన పోరాట ఫలమే ఈ విజయమని, మంత్రి రాజీనామాను ప్రభుత్వం ఆమోదించడంపై స్థానిక యువత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పండుగ వాతావరణంలో బాణా సంచా కాలుస్తూ, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ నినాదాలు చేశారు. భవిష్యత్తులో కూడా యువజన హక్కుల కోసం ఐక్యంగా పోరాడతామని, యువత శక్తిని తక్కువగా అంచనా వేయకూడదని హెచ్చరించారు. ఈ వేడుకల్లో గ్రామస్థులు, నాయకులు, విద్యార్థులు మరియు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మద్దతు తెలిపారు.

## అంగరంగ వైభవంగా ఆషాడమాసం బోనాల ఊరేగింపు



రాయికోడు, జూలై 26, (జనంసాక్షి): మండల కేంద్రమైన రాయికోడుతో పాటు మండల పరిధిలోని మాటూరు, యూసుఫ్‌పూర్, తదితర గ్రామాలలో ఆషాడ మాసం ను పురస్కరించుకొని మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని డప్పు చప్పుళ్ళ మధ్య పోతురాజుల విన్యాసాలతో ఆటపాటలతో భక్తిశ్రద్ధలతో బోనాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి తమ తమ ముక్కులను చెల్లించుకున్నారు. తధానంతరం అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. నిర్వాహకులు అతిథులందరికీ శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నర్సింలు,మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్, మాజీ వైస్ చైర్మన్ మహంకాళి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సి విట్టల్, ప్రధాన కార్యదర్శి కే శంకర్, ఆయా గ్రామాల సర్పంచులు రాధా తుకారామ్,పట్లోళ్ల సంగారెడ్డి,రాజశేఖర్ గౌడ్, అభిబాబి,తమ్మలి రాజు, మాజీ ఎంపీటీసీలు నల్లోల ఆగమయ్య, చంద్రయ్య, పండరి,నాయకులు ఎండి పత్రుమియా, మక్బుద్, హనుమన్న పాటిల్, శివారెడ్డి, మహబూబ్ పాటిల్, జైపాల్ రెడ్డి, భద్రప్ప, సంగమేశ్వర్ పాటిల్, మొట్లకుంట సంగమేష్, విట్టల్ రావు కులకర్ణి, మొగిలిగితే మల్లేశం, ఎం శివకుమార్ డాక్టర్ వెంకటేశం, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్ లు, పలువురు ప్రజాప్రతినిధులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వ కానుకలు

- రంగంపేట హాస్టల్ విద్యార్థులకు నోట్ బుక్స్, పాత్రల పంపిణీ...
- ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బేగం



కొల్చారం, జూలై 26 (జనంసాక్షి): ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని వసతి గృహాల్లోని విద్యార్థులు బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని రంగంపేట గ్రామ సర్పంచ్ స్వర్ణలత విజయ్ అన్నారు. కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వసతి గృహ విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్లేట్లు, గ్లాసులు, స్పూన్లు, సాసర్లు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బేగం మరియు గ్రామ సర్పంచ్ స్వర్ణలత విజయ్ చేతుల మీదుగా విద్యార్థులకు ఈ సామగ్రిని అందజేశారు.
ఈ సందర్భంగా ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బేగం మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. సర్పంచ్ స్వర్ణలత విజయ్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి పరుశురాం, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్ రాములు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం

- ఉత్సాహంగా పాల్గొన్న నంగునూరు మండలం బీజేపీ నాయకులు
- మంత్రి, ఎంపీ తో రైలులో ప్రయాణించిన కిసాన్ మోర్చా జిలా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి



**నంగునూరు, జూలై 26 (జనంసాక్షి):** తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో మైలురాయిగా నిలిచిన కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నంగునూరు మండల భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రైల్వే విస్తరణ పనులు తెలంగాణ అభివృద్ధికి కీలకంగా మారుతున్నాయని వారు పేర్కొన్నారు. కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన నేపథ్యంలో రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడం భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని నాయకులు తెలిపారు. ముఖ్యంగా జాతర సమయాల్లో లక్షలాది మంది భక్తులు సులభంగా ప్రయాణించే అవకాశం కలుగుతుందని చెప్పారు.

రైల్వే స్టేషన్ ప్రారంభంతో కొమురవెల్లి పరిసర ప్రాంతాల్లో వాణిజ్య, పర్యాటక రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం రవాణా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకురావడంలో భారతీయ జనతా పార్టీ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రైల్వే స్టేషన్ ప్రారంభించి రైలులో గజ్వేల్ వరకు ప్రయాణించారు. మంత్రి వెంట మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి రైలులో ప్రయాణించారు. రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి దాసరి యాదమల్లు, మండల శాఖ అధ్యక్షుడు చౌడుచర్ల వెంకట్రామిరెడ్డి, వల్లపు రెడ్డి రజనీకర్ రెడ్డి, నాయకులు గంధం పరమేశ్వర రెడ్డి, కత్తుల పరమేశ్వర్ రెడ్డి,అంబేద్కర్ రజనీకర్ రెడ్డి, జీడిపల్లి రజనీకాంత్ రెడ్డి, పెద్ది లవకుమార్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌లో అట్టహాసంగా 18వ ఈశా గ్రామోత్సవం



**మెదక్ టౌన్, జూలై 26, (జనంసాక్షి):** మెదక్ ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18వ ఈశా గ్రామోత్సవం క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 300 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ విభాగాల్లో ప్రతిభ కనబరిచారు.పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఈశా గ్రామోత్సవం ఫైనల్ పోటీలు సెప్టెంబర్ 6న కోయంబత్తూరులోని ఈశా యోగా కేంద్రంలో జరగనున్నాయి. విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, ఐక్యత పెంపొందించడంలో ఈశా గ్రామోత్సవం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని, గెలుపు–ఓటమికంటే క్రీడాస్ఫూర్తి ముఖ్యమని అన్నారు. గ్రామాల మధ్య స్నేహభావం, సామరస్యాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. మహేష్, డీవైఎస్‌వో రమేష్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

# నంగునూరులో మూడు రోజుల విత్తన మేళ

- రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటు

**నంగునూరు, జూలై 26(జనంసాక్షి):** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నంగునూరు రైతు వేదికలో జూలై 27, 28, 29 తేదీలలో మూడు రోజుల పాటు విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి గీత తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అనువైన పంటల విత్తన రకాలను అందుబాటులో పెడుతున్నట్లు వెల్లడించారు. ఈ విత్తన మేళాలో చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవడంతో పాటు సాగు వ్యయాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని కోరారు.

జూలై 27 నుంచి 29 వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి నంగునూరు రైతు వేదికలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి గీత విజ్ఞప్తి చేశారు.

### గూడెం పాఠశాల

# ప్రహరీ పనుల పరిశీలన



**గూడెం,జూలై 26,(జనంసాక్షి):** గూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను మాజీ ఎంపీపీ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఒగ్గు దామోదర్ మాట్లాడుతు విద్యార్థుల భవిష్యత్తు,భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు రూ.20 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణా నికి, రూ.6 లక్షలతో కిచెన్ షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూనే,మరోవైపు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గూడెం గ్రామ సర్పంచ్,సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్,మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కర్రావుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### తూప్రాన్ డివిజన్

# బ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా ఆత్రేయ శర్మ




**తూప్రాన్, జులై 26(జనంసాక్షి):** మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ బ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఆదివారం రోజు పెద్ద చెరువు కట్ట విరాంజనేయ స్వామి ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మెదక్ జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సలాక రాజేశ్వర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన తూప్రాన్ డివిజన్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా తూప్రాన్ పట్టణానికి చెందిన సలాక ఆత్రేయశర్మ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కాసుల సాత్విక్ శర్మ కోశాధికారిగా రామకృష్ణ శర్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని బ్రాహ్మణులు భారీగా పాల్గొని ఏకగ్రీవ ఎన్నికకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్లోని బ్రాహ్మణులు పాల్గొన్నారు.

# ఘనంగా మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రవితేజ రెడ్డి జన్మదిన వేడుకలు

- ప్రజాసేవలో తనదైన ముద్ర వేస్తున్న రవితేజ రెడ్డి
- మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలి....
- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**కౌల్చారం, జూలై 26(జనంసాక్షి):** ప్రజాసేవలో తనదైన ముద్ర వేస్తున్న రవితేజ రెడ్డి మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలనీ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, పైతర గ్రామ సర్పంచ్ యాబన్నగారి రవితేజ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కేక్ కట్ చేయించి రవితేజ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి రవితేజ రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, అభిమానులు రవితేజ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, తుక్కాపూర్ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, మాజీ సర్పంచ్ మురళి గౌడ్, బోయిని ఆంజనేయులు గౌడ్ సోమ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు



**బెజ్జంకి,జూలై 26,(జనంసాక్షి):** మండల కేంద్రంలో రెడ్డి ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి రెడ్డి ఐక్య సంఘం కుటుంబ సభ్యులు,వారి బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించీ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి ఐక్య సంఘం అధ్యక్షుడు పుర్మ సుదీర్ రెడ్డి మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలి అనీ, పోచమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘ సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



**తూప్రాన్, జులై 26(జనంసాక్షి):** వివేకానంద సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మనోహరాబాద్ మండల కేంద్రంలోని శుభం గార్డెన్ లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్వామి వివేకానంద గ్రంథాలయంలో చదువుకుని ఉద్యోగాలు సాధించిన వారందరూ పాల్గొన్నారు. మనోహరాబాద్ లోని స్వామి వివేకానంద గ్రంథాలయంలో చదివి ఒక్కరి ఉద్యోగంతో మొదలై ప్రస్తుతం 50 మంది వరకు వివిధ శాఖలలో ఉద్యోగాలు సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ గోవర్ధన్ గౌడ్, పోలీస్ వెంకట్ రెడ్డి, సురేష్,నవీన్, అబ్దుల్ నయీమ్, నౌషత్,ముఖ్య అతిథులు పాల్గొని మాట్లాడారు. ఇందులో వివిధ శాఖలలో ఉద్యోగాలు పొందిన వారు గతంలో గ్రంథాలయంలో చదివిన మనోభావాలను వారు జీవితంలో పడిన కష్టాలు ప్రస్తుతం పొందుతున్నా సంతోషాలను వ్యక్తపరిచారు. గ్రంథాలయం వల్లనే మేము ఈరోజు చదువుకుని ఈ స్థాయికి వచ్చామని వారి సంతోషం వ్యక్తం చేశారు.. సుమారు మండలంలో 17 శాఖలలో50 మంది వరకు గ్రంథాలయం ద్వారా ఉద్యోగాలు సాధించడం జరిగిందన్నారు.

# అట్రాసిటీ చట్టం అమలులో రాజీవద్దు..

- చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సివిఎంసి డిమాండ్..
- గండీడ్‌లో మండల సమావేశం..బాధితులకు సత్వర న్యాయం,రక్షణ కల్పించాలని తీర్మానాలు

**గండీడ్, జూలై 26 (జనంసాక్షి):** ఎస్సీ, ఎస్టీ(అత్యాచారాల నిరోధక)చట్టాన్ని కఠినంగా అమలు చేసి బాధితులకు సత్వర న్యాయం, రక్షణ కల్పించాలని జిల్లా సిటిజన్స్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (సివిఎంసి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం నాడు గండీడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో మండల చైర్మన్ రంగారెడ్డిపల్లి వివేకానంద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు.జిల్లా సివిఎంసి కన్వీనర్,న్యాయవాది.ఈ.రాములు మాట్లాడుతూ..అట్రాసిటీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను అడ్డుకోవాలని,బాధితులకు ప్రకటించిన పరిహారాన్ని ఏడు రోజుల్లో అందజేయాలని,ప్రత్యేక కోర్టుల్లో శాశ్వత స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని,రాష్ట్ర,జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరారు.సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ సి.ఆనంద్,మద్దూరి భీమమ్మ,కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కష్టాపూర్ ఆశన్న,ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య,మండల కోఆర్డినేటర్ చిన్నయ్య,మండల కన్వీనర్ వివేకానంద్, హస్నాబాద్ వెంకటయ్య, చెన్నయ్య, మహేందర్వెంకటయ్య, గోపికృష్ణ, కృష్ణయ్యమల్లేష్,హనుమయ్య,నరసయ్య,హస్నాబాద్ చంద్రయ్య,హన్మిరెడ్డి, మల్లయ్య,బాలయ్య,అమృతమ్,బాలకిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మన్ కీ బాత్ వీక్షించిన బిజెపి నాయకులు



**నారాయణపేట, జూలై 26(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ స్వగృహంలో బిజెపి నాయకులు దేశ ప్రధాని నరేంద్రమోదీ మన కీ బాత్ కార్యక్రమాన్ని టీవీ లో వీక్షించారు.ఈ మన్ కీ బాత్ లో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ డిఫె న్స్ టెక్నాలజీలో భారత్ కు సాటి లేదని,యువ శాస్త్ర వేత్తలు అందుకు కారణమ ని కొనియాడారు.కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరులైన జవాన్లకు నివా ళు లు అర్పించారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ మాట్లాడుతు ఒక దేశ ప్రధాని ప్రతి నెల మన్ కీ బాత్ ద్వారా అన్ని అంశాలపై దేశ ప్రజలతో తన బావాలు పంచుకోవడం విశేషమని అన్నారు. మన్ కీ బాత్ వీక్షించిన వారిలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ ,కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ,కౌన్సిలర్ ప్రభాకర్,నాయకులు కృష్ణ,శ్రీనివాస్,ప్రమీలబాయి, హన్మతురావు,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మనూర్ మండలంలో రూ.20 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

- తున్నూర్, మొగ్దంపూర్ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన



**నారాయణఖేడ్ జూలై 26 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మనూర్ మండలంలోని తున్నూర్, మొగ్దంపూర్ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులతో చేపట్టనున్న రూ.20 లక్షల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

తున్నూర్ గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు, మొగ్దంపూర్ గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, పనులు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు అవసరమైన నిధులను సమకూర్చి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగుతాయని చెప్పారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, సర్పంచులు మోహన్‌రెడ్డి, సంజీవులు, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మోటార్లు వెంటనే ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి బ్యూరో, జూలై 26 (జనంసాక్షి):** రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాల మోటార్లను వెంటనే ప్రారంభించి రైతాంగానికి సాగునీరు అందించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకం మోటార్లతో పాటు కన్నెపల్లి మోటార్లను కూడా తక్షణమే ప్రారంభించాలని ఆయన కోరారు.

రాజకీయాలను పక్కనబెట్టి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి సరఫరాపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చంద్రబాబు నాయుడు తాబేదారుగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమైక్యవాది అని, తెలంగాణ ప్రయోజనాల పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. అలాగే సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, రైతుల అవసరాలపై శ్రద్ధ కనిపించడం లేదని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని అన్ని ఎత్తిపోతల పథకాల మోటార్లను వెంటనే ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని, ఎత్తిపోతల పథకాల పరిధిలోని చెరువులు, కుంటలను నింపాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పైప్రాంతాల నుంచి వస్తున్న వరద జలాలను పూర్తిగా వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ప్రభుత్వం ఆ దిశగా తగిన చొరవ చూపుతున్నట్లు కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కుంటి సాకులు చెప్పి రైతుల పొలాలు ఎండబెట్టకుండా, వెంటనే రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాల మోటార్లు ప్రారంభించి సాగునీరు అందించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# జోగులాంబ గద్వాల్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు విజయవంతం

**గద్వాల, జూలై 26(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు అత్యంత వైభవంగా ముగిశాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు ఈ పోటీలకు తరలివచ్చి తమ యుద్ధకళా ప్రతిభను చాటుకున్నారు. సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా కొరిగి పూమ్సే విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించారు.ఘనంగా ప్రారంభించిన ముఖ్య అతిథులు:ఈ క్రీడా పోటీలను జిల్లా డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, గద్వాల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యమ్. కృష్ణయ్య, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ అయ్యప్ప రెడ్డి, స్టేడియం ఇంచార్జి బషీర్, వెంకటేష్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తైక్వాండో వంటి యుద్ధకళలు విద్యార్థుల్లో కేవలం శారీరక దృఢత్వాన్ని మాత్రమే కాకుండా ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, వినయం, విధేయత వంటి సద్గుణాలను పెంపొందిస్తాయని కొనియాడారు. నేటి కాలంలో ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని వారు సూచించారు.



**రాష్ట్రస్థాయికి విజేతల ఎంపిక:** జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి మాస్టర్ కే. శ్రీహరి మాట్లాడుతూ.. ఈ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాలు సాధించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు. వీరంతా వచ్చే ఆగస్టు 8, 9, 10 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జోగులాంబ గద్వాల్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు శ్రీనివాస్ శెట్టి, రంగస్వామి, మారుతి, శ్రీను, రామేశ్వరి, మల్లికార్జున్ గౌడ్, లింగేష్, విష్ణు, సుధీర్‌లతో పాటు సీనియర్ విద్యార్థులు, క్రీడాకారులు మరియు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.

# గొడుగు ఎల్లయ్య మాతృమూర్తికి ఘన నివాళులు అర్పించిన మాజీ మంత్రి



**వనపర్తి రూరల్, జూలై 26, (జనంసాక్షి):** వనపర్తి మండలం రాజపేట గ్రామ సర్పంచ్ గొడుగు ఎల్లయ్య మాతృమూర్తి కీ.శే. గొడుగు చెనమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా చెనమ్మ జీవితాన్ని స్మరించుకుంటూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం సర్పంచ్ గొడుగు ఎల్లయ్యతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఈ తీరని విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రఘువరన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ధర్మనాయక్, మాధవరెడ్డి, సుదర్శన్ రెడ్డి, రైతు సమితి అధ్యక్షుడు దేవర్ల నరసింహ, దేగ మహేశ్వర్ రెడ్డి, సంపత్ కుమార్ రెడ్డి, చిట్యాల రాము, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొని మృతురాలికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు

# ప్రజారోగ్యానికి అభయహస్తం..

- మహమ్మదాబాద్‌లో ఉచిత వైద్యశిబిరానికి శ్రీకారం..



**మహమ్మదాబాద్,జూలై 26(జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండల కేంద్రంలో అభయ ప్రద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మహమ్మదాబాద్ గ్రామ సర్పంచ్ రామ్ లాల్,డిప్యూటీ సర్పంచ్ ఈ.పవన్ కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడం అభినందనీయమని, పేర్కొన్నారు. ఈశిబిరానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆరోగ్య సూచనలు అందించాలని అన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయ పడ్డారు. ఈకార్యక్రమంలో వార్డ్ సభ్యుడు రహీం,ఎస్సీసెల్ అధ్యక్షుడు నాగయ్య, యూత్ కాంగ్రెస్ సభ్యులు అఖిల్,వెంకటేష్,ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రంగు రంగుల గాజులతో శోభాయమానంగా

**పాపన్నపేట, జూలై 26 (జనంసాక్షి):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. ఆషాఢ మాసం రెండవ ఆదివారం పురస్కరించుకొని రంగు రంగుల గాజులతో వన దేవతను విశేషంగా అలంక రించారు. అర్చకులు వేకువ జామున దుర్గమ్మకు అబి .షేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. శోభాయమానంగా దర్శనమిస్తున్న అమ్మ వారిని భక్తులు దర్శించుకుని పలు మొక్కులు చెల్లించారు.

# కార్గిల్ అమరవీరులకు ఏబీవీపీ ఘన నివాళి



**తెలకపల్లి, జూలై 26, (జనంసాక్షి):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తెలకపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద విద్యార్థి పరిషత్ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు కార్గిల్ యుద్ధ అమరవీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థి ప్రముఖ వెంకటేష్ మాట్లాడుతూ, 1999లో పాకిస్తాన్ కార్గిల్ ప్రాంతంలో చొరబాటుకు పాల్పడగా, భారత సైన్యం ఆపరేషన్ విజయ్ ద్వారా సుమారు 60 రోజులపాటు వీరోచితంగా పోరాడి విజయాన్ని సాధించిందన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన 527 మంది భారత జవాన్ల త్యాగాలను దేశం ఎప్పటికీ మరువదని పేర్కొన్నారు. వారి స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అరవింద్, పరమేశ్, శివ, వెంకటేష్, భాను, విజయేందర్, వినయ్, బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు, గుంటూరు రాముడు, విశ్వహిందూ పరిషత్ నాయకులు రవిచారి, గుంటూరు శివశంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలలో వరుణ యాగాలు చేయాలి

**మల్దకల్, జూలై 26(జనంసాక్షి):** మండల పరిధిలోని మేకలసోంపల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారంధూప దీప నైవేద్య అర్చక సంఘం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రవర్తి చార్యులు హాజరై మాట్లాడుతూ అర్చక సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి సభ్యుల సంఖ్యను పెంచుకోవడం,అర్చకులకు ఐడి కార్డుల జారీ,ఆరోగ్య పథకాల అమలు,ఇంటి నిర్మాణ పథకాల సాధన వంటి అంశాలపై చర్చించారు.రైతులందరి సంక్షేమం,సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ జిల్లాలోని ఆలయాల్లో వరుణ యాగాలు నిర్వహించాలని తీర్మానించారు.అర్చకుల హక్కుల సాధన, సంఘ పటిష్టత, ప్రభుత్వం నుంచి రావలసిన సంక్షేమ పథకాలు ఇతర ప్రయోజనాలను సంఘ ఐకమత్యంతో సాధించుకోవాలని చక్రవర్తి చార్యులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల ఇన్‌చార్జీలు నరేష్ జోషి, భద్రయ్య, శేఖరయ్య, ఆంజనేయులు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలకు మైక్ సెట్ బహుకరించిన పూర్వ విద్యార్థులు




**వెల్దండ, జులై 26 (జనంసాక్షి):** వెల్దండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మైక్ సెట్ ను బహుకరించారు. తాము చదివిన పాఠశాలలో మైక్ సెట్ పాడైపోయిన విషయాన్ని తెలుసుకున్న విద్యార్థులు రూ. 55 వేల రూపాయల విలువగల మైక్ సెట్ , బాక్సులను అందజేశారు. భవిష్యత్తులో పాఠశాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి. కృష్ణయ్య, రఘు,కోటయ్య, ఎన్. గణేష్, ఉప్పు వెంకటేశ్వరరావు (బాబు) లక్ష్మయ్య, ఆదినారాయణ రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

# నీటి కష్టాలకు చెక్..
# మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌కు కొత్తబోరు



**గండీడ్, జులై 26(జనంసాక్షి):** గండీడ్ మండలంలోని,వెన్నచెడు గ్రామంలో మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి.హాస్టల్‌లో నెలకొన్న నీటి అవస్థలను గుర్తించిన స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈవిషయాన్ని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విద్యార్థినులకు నీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు శనివారం హాస్టల్ ఆవరణలో నూతన బోరు డ్రిల్లింగ్ పనులను చేపట్టించారు.ఈసందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ,విద్యార్థినులకు మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు.హాస్టల్‌లో ఇకపై తాగునీటి కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య,గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగుల అనంత లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి,చెన్నకేశవులు,బాలికల హాస్టల్ వార్డెన్ వీణాదేవి, డైరెక్టర్ బోయిని పుష్పలత,ఉప సర్పంచ్ రవికాంత్ రెడ్డి,మాజీ సర్పంచ్ గోపాల్,మాజీ ఎంపీటీసీ ఆశన్న గౌడ్,మాజీ డైరెక్టర్ రామ్‌రెడ్డి,కాంగ్రెస్ నాయకులు బాలయ్య,పులిందర్ రెడ్డి, శరణప్ప, రాములు గౌడ్,మాసయ్య,రవీందర్ గౌడ్,ఆలేటి నరసింహులు,గంగుల రాఘవరెడ్డి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్



**కోహీర్, జులై 26 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కనీస విద్యుత్ దీపాలు లేకపోవడంపై గ్రామస్థులు, డప్పు నవీన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు . విగ్రహం వద్ద లైట్లు లేకపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారంగా మారిందని, ఇటువంటి ముఖ్యమైన ప్రదేశంలో వెలుతురు లేకపోవడం అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు మండిపడుతున్నారు. ఇటీవల కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయమై విజయోస్త సంబరాలు జరుపుకునేందుకు అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించేందుకు వెళ్లిన సమయంలో తీవ్ర చీకటి అలముకుని ఉండటంతో కార్యక్రమానికి ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ మరియు సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, గ్రామంలో నిలిచిపోయిన వీధిలైట్లతో పాటు అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ వెలుగునిచ్చే విద్యుత్ లైట్లను అమర్చాలని డిమాండ్ చేశారు.

# అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా చిరంజీవి (చిరు) ఏకగ్రీవ ఎన్నిక




**సదాశివపేట, జూలై 26(జనంసాక్షి):** అంబేద్కర్ యువజన సంఘం సదాశివపేట పట్టణ, మండల అధ్యక్షుడిగా చిరంజీవి (చిరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు పంబల్ల దుర్గాప్రసాద్ ఆయనకు నియామక పత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమానికి జాతీయ కో-ఆర్డినేటర్ ఎస్. వరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను యువతలోకి తీసుకెళ్లేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు.
నూతన అధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, యువత సాధికారత కోసం పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కృషి చేస్తానన్నారు. పట్టణ కమిటీ ఉపాధ్యక్షులుగా ఎం. సాయి కుమార్, బి. అనూప్ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్. సుధాకర్, పి. మహేష్, పి. భరత్, ఏ. విజయ్ కుమార్, బి. నరేష్ లను నియమించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో త్వరలో కమిటీలు ఏర్పాటు చేసి సామాజిక సేవా, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, యువజన సభ్యులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొని చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు.

# మనమందరం కలిసి మండల అభివృద్ధి చేసుకుందాం



**అమరచింత, జూలై 26 (జనంసాక్షి):** ఆదివారం మున్సిపాలిటీలో దేశాయి మురళీధర్ రెడ్డి స్కూల్ ఆవరణంలో అమర్ చింత మండల అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ముఖ్య మైన మన సొంత మున్సిపాలిటీకి చెందిన వారు.దేశాయి ప్రకాష్ రెడ్డి అఖిలపక్షం పార్టీ కలిసి ప్రజలతోనే ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. కావడం జరిగింది. అమరచింత మండల అభివృద్ధి కోసం ఎస్బిఐ బ్యాంకు కోసం మన ప్రాంతంలో ఏర్పాటు కొరకు ముఖ్యఅతిథిగా అమరచింత అభివృద్ధి కోసం అఖిలపాక్ష సమావేశంలో పాల్గొన్న మాజీ అడ్వకేట్ జనరల్ ప్రకాశ్ రెడ్డి సార్. మాజీ అడ్వకేట్ జనరల్ ప్రసాద్ సార్ ఇద్దరు కలిసి మన అమరచింత ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇక్కడ ఎస్బిఐ బ్యాంక్ సంబంధించినటువంటి రిజర్వ్ బ్యాంక్ పర్మిషన్లు ఫార్మాలిటీస్ అన్ని విధాలుగా నా యొక్క సహాయ సహకారం ఉంటుందని. అమరచింత లో ఎస్బిఐ బ్యాంకు కోసం తప్పకుండా నా వంతుకృషి చేస్తాను. సార్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ గీత పారిశ్రామిక సహకార సంస్థ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ అమర చింతలో దుబాయ్ కుంటలో 14 ఎకరాల భూమిలో ఏడెకరాల్లో ఇండ్లు లేని వారికి ఇల్లు ఏర్పాటుకు చేస్తామని తెలిపారు. భూమిలో 7 ఎకరాల్లో సమీకృత ప్రభుత్వ కార్యాలయాలు కోసం తాసిల్దార్.ఎంపీడీవో. అగ్రికల్చర్ .16న్నర కోట్లు కేటాయించడం జరిగింది. అదేవిధంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు. నాలుగు కోట్లు మంజూరు చేయడం జరిగింది. అదేవిధంగా రెండు కోట్లతో స్పోర్ట్స్ సంబంధించిన సబ్ స్టేషన్ పక్కన నాలుగు ఎకరాల నర ప్రభుత్వభూమి కలిగి ఉన్నది. అది గవర్నమెంట్ స్థలం కాబట్టి క్రీడలకు సంబంధించి రెండు కోట్లు ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా బైపాస్ రోడ్డు గూర్చి మంత్రి దృష్టికి తీసుక పోవడం జరుగుతుంది. ప్రకాష్ రెడ్డి సార్ మాట్లాడుతూ అమర్ చింత అభివృద్ధి కోసం నా వంతు సహకారం ఎప్పటికీ ఉంటాదని తెలిపారు డి ఎం ఆర్ స్కూల్ అదేవిధంగా అమరచింతలో హాస్పిటల్ పి ఎస్ గా మారుస్తే మండల ప్రజలకు నియోజకవర్గం కావాలని ప్రయత్నం చేయాలి. నాయకులు ప్రజలు ఈ అఖిలపక్ష సమావేశంలో మీరందరూ కలిసి ప్రయత్నం చేయండి. నా వంతు నా సహకారం ఉంటాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం మాట్లాడుతూ గ్రామ కమిటీలు మండల కమిటీలు మున్సిపాలిటీ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రజిని సాయి చందు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అడ్వకేట్ రామన్ గౌడ్ మున్సిపల్ చైర్మన్ జింక సువర్ణ వైస్ చైర్మన్ రాధా అరుణ్ కుమార్ కౌన్సిలర్లు ఎం లక్ష్మి వెంకటేష్ పి తిరుమలేష్ జే వనిత ప్రకాష్ వై రాములు మాధవి రాములు కోఆప్షన్ సభ్యులు తోఫిక్ అజయ్ మన్నెమ్మ డేవిడ్ ఆయా గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లోకపల్లిలో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి: ఆలయ కమిటీ నిర్ణయం

**నారాయణపేట, జూలై 26(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలో గల రావి చెట్టులో కొలువుదీరిన శ్రీ శ్రీ శ్రీ లోకాయపల్లి లక్ష్మమ్మ మాత శ్రావణ మాస ఉత్సవాలను ఈ సారి అత్యంత ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీనిర్ణయించింది. శ్రావణ మాసం వేడుకలను పురస్కరించు కొని ఆదివా రం ఉదయం ఆలయ కమిటీ అధ్యక్షుడుశశికాంత్ యాదవ్అధ్యక్షతన ఆలయ కమిటీ కార్యవ ర్గము, గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలు దేవాలయం దగ్గర సమావే శం నిర్వ హించారు. వచ్చేనెల ఆగస్టు 14 వ తేది న శ్రావ ణమాసం మొదటి శ్రావణ శుక్రవారం తో మొదలై సెప్టెంబర్ 11 వ తేది రోజు ఆఖరి శుక్రవారం అమ్మవా రి జాతర మహోత్సవం నిర్వహించడం జరుగు తుందన్నారు. అలాగే శ్రీ శ్రీ కోట ఆంజనేయ స్వామి శిఖర నిర్మాణం పనులను పూర్తిచేసే దేవా లయ మును రంగులతో అలంకరించి ఆగస్టు 27వ తేదీ గురువారం నాడు ఆంజనేయస్వామి శిఖర కలశ ప్రతిష్టాపన చేయాలని ఆలయ కమిటీ సభ్యులు ఇటి సమావేశంలో నిర్ణయించారు. అమ్మవారి సన్నిధానం జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమాలు శ్రావణమాసంలో భక్తులు ఇచ్చినటువంటి విరాళాలు ద్వారానే ఇక్కడ ఆలయ కమిటీ సభ్యులు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు శశికాంత్ యాదవ్ ప్రతి సంవత్సరం లాగానే భక్తులకు తగిన సౌకర్యాలు చేసి కమిటీ సభ్యులు ఐక్యమత్యంతో అమ్మవారి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళ్దామని కోరారు.
అమ్మవారి దేవస్థానం శ్రావణమాసం ఒక నెల నిమిత్తం టెంకాయలు టెండరు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం లో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కన్నా జగదీష్, ఎల్ రాధాకృష్ణ, రవికుమార్ గౌడ్, కోశా ధికారి లప్ప అశోక్, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, సహకార్యదర్శి ఆర్ భాస్కర్ రెడ్డి, గొల్ల బుగ్గన, పిల్లి నరసింహులు, రమాకాంత్ సంతోష్ నామాజీ, ఆలయ పూజారి సోమశేఖర స్వామి, కమిటీ సలహాదారులు ఆత్మరామ్ హెడ్కె మొదలగు భక్తులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ డైరెక్టర్‌కు ఘనసన్మానం



మహమ్మదాబాద్, జూలై 26(జనంసాక్షి): గండీడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) డైరెక్టర్‌గా నియమితులైన బాల ముకుందంను ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి అభినందనలు తెలిపిన నాయకులు,కొత్త బాధ్యతల్లో విజయవంతంగా పనిచేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిత్తూరు చంద్రకుమార్ గౌడ్,టీపీసీసీ అధికారి జహీర్ అక్తర్,డీసీసీ ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్ తదితరులు బాల ముకుందంకు శుభాకాంక్షలు తెలియజేస్తూ..సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని,పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం



వెల్దండ, జూలై 26 (జనంసాక్షి): గ్రామీణ ప్రాంత నిరుపేద ప్రజల కోసమే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నమని యెన్నమ్స్ చైర్మన్ డాక్టర్ హరికాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పాత బ్యాంక్ దగ్గర యెన్నమ్స్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు భూపతిరెడ్డిలు ప్రారంభించారు.మారుతున్న జీవనశైలి వల్ల వస్తున్న అనారోగ్య సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల నిరుపేదలకు ఆర్థిక భారం తగ్గుతుందని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ శిబిరంలో దాదాపు 300 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో మరియు థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ యెన్నం అంజన్ రెడ్డి, ఎముకల డాక్టర్ వెంకటేష్, జనరల్ సర్జన్ డాక్టర్ శ్రీనివాసులు,జనరల్ మెడిసిన్ దినేష్ కుమార్, స్త్రీల ప్రత్యేక వైద్యురాలు శ్రీవాత్సవి, డీఎంఓ అభిషేక్, జనరల్ మేనేజర్ కె రవి కుమార్, ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్,వార్డు మెంబర్స్, నాయకులు పొలాది మల్లీశ్వరి రంగనాథం, గుద్దటి కిష్టల్, మారేపల్లి శ్రీనివాస్, మసిగుండ్ల వెంకటేష్, మట్ట భరత్ గౌడ్, జంగిలి ఆనంద్ రాజ్, గోరటి భరత్, సమీర్, శేఖర్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రైతుల ఆశలన్నీ ఆకాశం వైపు..

## శాలి పైల్వాన్ దేవుడికి ప్రత్యేక పూజలు



మానవపాడు, జూలై 26(జనంసాక్షి): మానవపాడు మండలం అమరవాయి గ్రామంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గ్రామస్తులు శాలి పైల్వాన్ దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో మిరప, పత్తి తదితర పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు ఎండిపోకుండా మంచి వర్షాలు కురవాలని రైతులు, గ్రామ ప్రజలు దేవుడిని వేడుకున్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి. హుస్సేన్, మాజీ ఎంపీటీసీ రోషన్న, మాజీ సర్పంచ్ కాంతరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు హుస్సేన్ పీర్, ఉప సర్పంచ్ బుచ్చన్న, రైతు నాయకులు లక్ష్మన్న, మంజూరు భాషా, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, మహిళలు, యువకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కలెక్టర్ ధర్నాను విజయవంతం చేయాలి: ఆంజనేయులు

మాగనూర్, (జనంసాక్షి): నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులకు కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లాలో సేవలందించే వైద్య సిబ్బందికి ప్రత్యేక అలయన్స్ ఇవ్వాలని సోమవారం జిల్లా కేంద్రంలో జరిగే కలెక్టరేట్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం పార్టీ మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూరు ఆంజనేయులు అన్నారు. మాగనూరు మండల కేంద్రంలో పుంజనూర్ ఆంజనేయులు, జిల్లా నాయకులు సి ఆర్ గోవింద్ రాజ్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడడం జరిగింది ,మన జిల్లాలోని జిల్లా జనరల్ హాస్పిటల్ మక్తల్ ఏరియా హాస్పిటల్ మండలాల్లో ఉన్న పీహెచ్సీ యూపీఎస్సీ సిహెచ్సి సెంటర్లలో కనీస సౌకర్యాలు కల్పించుటకు మెరుగైన వైద్య సేవలు అందించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టులు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రోజు జరుగు కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని కోరడం జరిగింది. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మక్తల్ ఏరియా పరిధిలోని మాగనూరు నర్వ కర్ని పి ఎస్‌సిలను వారం రోజులపాటు సందర్శించి అనేక సమస్యలను గుర్తించడం జరిగింది. జిల్లాలో ప్రభుత్వ వైద్యశాఖలో సౌకర్యాలు అరకొరగా ఉండడంతో వైద్యం కోసం ప్రజానీకం తప్పని పరిస్థితిలో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేల రూపాయల అప్పులు చేయాల్సి వస్తుంది. అప్పులతో పేదరికంలోని నెట్టివేయడం జరిగింది అన్ని పిఎస్‌సిలను 24 గంటల వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి అన్ని ఆసుపత్రుల పరిధిలో తాగునీటి సదుపాయం కల్పించి ఆసుపత్రుల్లో పేషెంట్లకు అవసరమైన కుర్చీలు బెంచీలు ఏర్పాటు చేయాలి అదేవిధంగా మాగనూరు పీహెచ్సీకి రెగ్యులర్ డాక్టర్ లేక రోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉంది కావున రెగ్యులర్ డాక్టర్లు పూర్తిస్థాయిలో స్టాఫ్ ను వెంటనే నియమించాలని కోరడం జరిగింది రేపు నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగే కలెక్టరేట్ ధర్నా కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.




## 3వ వార్డులో దిష్టిబొమ్మలా విద్యుత్ స్తంభాలు

- తీగలు అమర్చకపోతే ఆందోళన: కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ



నారాయణపేట జూలై 26(జనంసాక్షి): నారాయణపేట మున్సిపాలిటీ 3వ వార్డులో గత పాలకవర్గం ఎన్నికల సందర్భంగా విద్యుత్ స్తంభాలు పాతి దిష్టి బొమ్మల్లా వదిలేశారని వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ అన్నారు. స్తంభాలకు వైర్లు బిగించాలని గత కొంతకాలంగా విద్యుత్ అధికారులతో పాటు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన ఫలితం లేకుండా పోయిందని ఆవేశం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఉద్దేశంతో ప్రజలు తమను గెలిపించారని దీంతో కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారులకు ఎన్నిసార్లు తీసుకువెళ్లిన సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు కానీ ఆచరణలో మాత్రం అధికారులు చూపడం లేదని ఆరోపించారు. గత మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తమ వార్డులో సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వారు పరిష్కరిస్తామని చెప్పి ఇంతవరకు ఆ సమ స్యలపై అధికారులు ఎందు కు దృష్టి సారించలేదని అన్నారు. అంతేకాకుండా విద్యుత్ అధికారులకు కూడా స్తంభాలకు వైర్లను బిగించాలని విన్నవించిన అధికారులు మాత్రం నిర్లక్ష్యంగానే వివరిస్తున్నా రని అన్నారు.కాలనీలోని విద్యుత్ స్తంభాలకు వైర్లను బిగించి లైట్లు వేస్తే ప్రజలు రాత్రి సమయాల్లో తమ తమ ఇళ్లకు చాలా సౌకర్యం గా ఉంటుందన్నారు.ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా కాలనీలో నెలకొ న్న సమస్యలపై పరిష్కరిం చాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు అధికారులతో కలిసి వాటి లోని సమస్యలను వారి కళ్లకు చూపించిన కూడా ఇంతవరకు అధికారులు సమస్యలను పరిష్కరించ దంలో నిర్లక్ష్యం వహించడం ఇది ఎంతవరకు సమంజస మని ఆమె ప్రశ్నించారు.

స్తంభాలకు వైర్లు వేయడం లో నిర్లక్ష్యం చేస్తూ ప్రజలు రాత్రి సమయాల్లో విష పురుగుల దాడి నుండి తమ ఇంటి నుండే రావ డానికి ప్రజలు భయపడుతున్నారని అన్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభా లకు వైర్లు బిగించాలని లేనిపక్షంలో కాలనీవాసుల ప్రజలతో కలిసి విద్యుత్ జిల్లా కార్యాలయం ముందు ధర్నా చేస్తామని ఆమె హెచ్చరించారు. దీంతోపాటు మూడో వార్డులో ప్రధాన రోడ్ల గుండా పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోయింద ని ప్రజల ఆరోగ్యాన్ని కాపా డేందుకు వార్డులో చెత్తాచె దారాన్ని వెంటనే తొలగించాలనికోరారు..అంతేకాకుండా వార్డులో పిచ్చికు క్కలను కూడా నివారించేందుకు తగు చర్యలు తీసుకో వాలని ఆమె మున్సిపల్ అధికారులకు సూచించారు.

### రాకమచర్ల వెంకటదాసు

## స్మారకోత్సవాలకు ఘన ఏర్పాట్లు

ఉప్పునుంతల, జూలై 26 (జనంసాక్షి): ప్రముఖ వాగ్గేయకారుడు, భక్తి కీర్తనల మహాకవి, సనాతన ధర్మ ప్రచారకుడు శ్రీ రాకమచర్ల వెంకటదాసు స్మారకోత్సవాలను ఈ నెల 28వ తేదీ (మంగళవారం) ఆయన స్వగ్రామమైన ఉప్పునుంతల మండలం పెద్దాపూర్ గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




రాకమచర్ల వెంకటదాసు తెలుగు భక్తి సాహిత్యానికి విశేష సేవలందించిన మహానుభావుడిగా పేరుగాంచారు. శ్రీమన్నారాయణుడితో పాటు సర్వదేవతలపై ఆయన రచించిన వేలాది భక్తి కీర్తనలు నేటికీ భజన సంప్రదాయంలో విశేష ఆదరణ పొందుతున్నాయి. ఆయన స్మరణార్థం నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 6 గంటలకు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఆయన స్వయంగా రచించిన కీర్తనలతో గ్రామ సంకీర్తన ప్రారంభమవుతుంది. అనంతరం భజన బృందాలు గ్రామ వీధుల్లో సంకీర్తన నిర్వహిస్తాయి.

ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో జరిగే స్మారక సభలో రాకమచర్ల వెంకటదాసు జీవితం, ఆయన భక్తి, సాహిత్య వైభవం, కీర్తనల విశిష్టత, తెలుగు భక్తి సాహిత్యానికి చేసిన సేవలపై పండితులు, భజన సంప్రదాయ ప్రముఖులు ప్రసంగించనున్నారు. అనంతరం భక్తులకు మహా ప్రసాదం (అన్నదానం) ఏర్పాటు చేశారు. ఈ స్మారకోత్సవాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భజన మండళ్లు, భగవత్ బంధువులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ రాకమచర్ల వెంకటదాసు గారి శిష్యులు విజ్ఞప్తి చేశారు.

### ఘనంగా

## తొలి ఏకాదశి వేడుకలు ముగింపు



మల్దకల్, జూలై 26 (జనంసాక్షి): మండల పరిధిలోని సద్దలోని పల్లి గ్రామంలో రెండు రోజుల పాటు వైకుంఠ తొలి ఏకాదశి సందర్భంగా శ్రీకృష్ణ-జయ కృష్ణ-జయ జయ కృష్ణ-శ్రీ కృష్ణ నామము,సకల దేవత అఖండ హరినామ సంకీర్తన లు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి దాతలు విరాళాలు ఇచ్చినవారు కీ..ర్తి..శేషులు పుట్టసవరన్న,గద్వాలటి.చెన్నయ్య, విఠలాపురం, దొడ్డ గోపాల్ పైపాడు ఈ కార్యక్రమ దాతలు శ్రీ స్వయంభు శ్రీకృష్ణ స్వామి దేవస్థానం నందుప్రత్యేక భక్తి శ్రద్ధలతో సంస్కృతి సంప్రదాయాలతో ఈ పూజలు నిర్వహిం చారు.శనివారం వైకుంఠ తొలి ఏకాదశి సందర్భంగా తెల్లవారు జాము నుంచి భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొని రద్దీ నెలకొంది భక్తులు బ్రహ్మ ముహూర్తం పవిత్రతతో భజన బృందాలతో మార్మోగాయి.ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణస్వామి అర్చకులు పాండు, గ్రామ సర్పంచ్ బెల్లం నర్సింహులు,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు యు.గోపా ల్, మాజీ సర్పంచ్ చిన్న అంజనేయులు,గ్రామ ఉపసర్పంచ్ పోతుల నరసింహులు,భజన మండలి హార్మోనిస్టు జయన్న,భజన మండలి సభ్యులు గ్రామ పెద్దలు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇరుకురోడ్లపై నిర్మాణ వ్యర్థాలు





మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం
నెలలుగా తొలగించని చెత్త.. ప్రజల ప్రాణాలతో చెలగాటం
ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం..

**అమీన్పూర్, జూలై 26 (జనంసాక్షి):** పన్నులు వసూలు చేయడంలో చూపుతున్న చొరవను ప్రజా సమస్యల పరిష్కారంలో మున్సిపల్ అధికారులు ఎందుకు చూపడం లేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపైనే ఇండ్ల నిర్మాణ వ్యర్థాలు నెలల తరబడి పేరుకుపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నిర్మాణ పనులు పూర్తయి చాలాకాలమైనా సిమెంట్ ముక్కలు, రాళ్లు, ఇసుక, మట్టి, చెత్తను రోడ్డుపైనే వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎస్‌ఎల్ కాలనీ శనివారం మార్కెట్ రోడ్డులో ఈ దుస్థితి నెలకొంది. ఇప్పటికే ఇరుకుగా ఉన్న రహదారిని నిర్మాణ వ్యర్థాలు మరింత ఆక్రమించడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ వ్యర్థాలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

నిర్మాణం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించాల్సిన బాధ్యత ఇంటి యజమానులపై ఉన్నప్పటికీ, నెలలు గడుస్తున్నా వారిపై మున్సిపల్ అధికారులు ఒక్క నోటీసు కూడా ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితం కావడం విమర్శలకు దారితీస్తోంది. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై స్పందించకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు.

ప్రధాన రహదారిపైనే ఈ పరిస్థితి ఉంటే అంతర్గత వీధుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగాక హడావుడిగా చర్యలు తీసుకునే బదులు, ముందస్తుగా నిర్మాణ వ్యర్థాలను తొలగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు మొద్దు నిద్ర వీడి స్పందించి రోడ్లను ఆక్రమించిన నిర్మాణ వ్యర్థాలను తొలగించి, నిబంధనలు ఉల్లంఘించిన ఇంటి యజమానులపై జరిమానాలు విధించాలని స్థానికులు కోరుతున్నారు.

# పసిపాప ప్రాణాలకు పెద్దన్నగా నిలిచిన కౌన్సిలర్

## ‘చికిత్స ఆగకూడదు’... రూ.2 లక్షల ఆపరేషన్ ఖర్చు భరిస్తానని మానవత్వం చాటిన బిఆర్ఎస్ కౌన్సిలర్ నాని



**సంగారెడ్డి, జులై 26 (జనంసాక్షి):** ఆ చిన్నారికి ఇప్పుడే ఆరు సంవత్సరాలు ప్రపంచాన్ని అర్థం చేసుకునే వయసు కూడా రాకముందే జీవితం ఆమెను కఠిన పరీక్షకు గురిచేసింది. తీవ్ర కిడ్నీ వ్యాధితో ప్రతి రోజు ప్రాణాల కోసం పోరాడు సంగారెడ్డి పట్టణంలోని సహస్ర హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జిల్లా కొండాపూర్ మండలం కుతుబ్షపేట గ్రామానికి చెందిన చిన్నారి ఆదివారం చిన్నారిని ఆసుపత్రిలో పరామర్శించి నా కౌన్సిలర్ నాని కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చిన్నారి తల్లి మృతి చెందింది. అంతకుముందే తండ్రిని కూడా కోల్పోయింది. తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన ఆ పసిబిడ్డకు ఇప్పుడు నాయనమ్మే తల్లి, తండ్రి. వృద్ధాప్యంలోనూ మనవరాలి ప్రాణాలను కాపాడుకోవాలని ఆమె పడుతున్న తపన అందరినీ కంటతడి పెట్టిస్తోంది. చిన్నారికి వెంటనే శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఇందుకు సుమారు రూ.2 లక్షలు అవసరమని చెప్పడంతో, ఆర్థికంగా అత్యంత దుర్భర పరిస్థితుల్లో ఉన్న కుటుంబం ఏం చేయాలో తెలియక సహాయం కోసం ఎదురుచూసింది. పాప బాధను వివరిస్తూ సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు ఎంతోమంది హృదయాలను కదిలించాయి.

ఆ వార్త సంగారెడ్డి పట్టణ బీఆర్ఎస్ కౌన్సిలర్ కొత్తపల్లి శ్రీకాంత్ (నాని) దృష్టికి చేరింది. వెంటనే చిన్నారి కుటుంబాన్ని కలిసి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. ఆ పసిపాప బాధను చూసి చలించిపోయిన ఆయన, “డబ్బు లేక ఒక చిన్నారి చికిత్స ఆగిపోకూడదు. ఆపరేషన్‌కు అయ్యే మొత్తం ఖర్చు నేనే భరిస్తాను” అని భరోసా ఇచ్చారు.ఆ మాటతో ఆ కుటుంబంలో మళ్లీ ఆశ చిగురించింది. ఎన్నో రోజులుగా కన్నీళ్లతో గడిపిన నాయనమ్మకు ధైర్యం వచ్చింది. చిన్నారి కుటుంబ సభ్యులు శ్రీకాంత్ (నాని)కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్ రావు, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు...

ఈ మానవతా నిర్ణయాన్ని స్థానికులు, ప్రజాప్రతినిధులు, నెటిజన్లు హర్షిస్తున్నారు. “నిజమైన నాయకుడు ప్రజల కష్టాల్లోనే గుర్తింపును పొందుతాడు”, “ట్రూ లీడర్ కొత్తపల్లి శ్రీకాంత్ (నాని)”, “పేదల కష్టాన్ని తన కష్టంగా భావించిన ప్రజానాయకుడు” అంటూ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నారి జీవితంలో వెలుగులు నింపేందుకు ముందుకు వచ్చిన కొత్తపల్లి శ్రీకాంత్ (నాని) చేసిన ఈ సహాయం సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# 36వ ‘మన్ కీ బాత్’ కార్యక్రమం వీక్షించిన బీజేపీ నాయకులు



**వనపర్తి బ్యూరో, జూలై 26 (జనంసాక్షి):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 136వ ‘మన్ కీ బాత్’ కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా కేంద్రంలో మూడు కేంద్రాల్లో ఆదివారం ఏర్పాటు చేశారు. అందులో 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గోపీనాథ్ నివాసంలో నిర్వహించిన కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు.

ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత మాత కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగం దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ యువత శాస్త్ర సాంకేతిక రంగం, ఆవిష్కరణలు, విద్య, క్రీడలు, స్టార్టప్‌లలో సాధిస్తున్న విజయాలను ప్రధాని అభినందించారు. యువత ప్రతిభ, సృజనాత్మకత భారతదేశాన్ని ప్రపంచంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ రక్షణ, సాంకేతికత, తయారీ రంగాల్లో దేశం స్వయం సమృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకమని, సమాజ సేవ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, నవకల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం, మెంటంపల్లి పురుషోత్తం, రామన్న, వెంకటేశ్వర్లు, కేతూరి బుడ్డన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భాషటి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ అలివేల, జిల్లా మీడియా కన్వీనర్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, కొమ్మ శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా నాయకుడు గంధం ప్రవీణ్, 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గోపీనాథ్, యువమోర్చా నాయకులు మధు, అరవింద్, రవి, చందు, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# 21 ఏళ్లకే చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

- మున్సిపాలిటీలలో యువతకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పెద్ద పీట
- సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సైతం ప్రతిపాదన
- కౌన్సిలర్ అల్కూరి పావని



**మక్తల్, జూలై 26 (జనంసాక్షి):** 21 ఏళ్లకే చట్టసభల్లో యువతకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ తాజాగా సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సైతం చేసిన ప్రతిపాదనను సమర్థిస్తున్నామని, తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అందరికన్నా ముందుగా ముఖ్యంగా మున్సిపాలిటీలలో తన లాంటి యువతకు పెద్ద పీట వేసి టికెట్ ఇవ్వడంతో పాటు గెలిపించడానికి తన వంతు సహకారం అందించి వార్డు కౌన్సిలర్ గా తనను నిలబెట్టారని, యువతకు పెద్దపీట వేసిన తొలి మంత్రివర్యులుగా మంత్రి వాకిటి శ్రీహరి పేరు చిరస్థాయిలో నిలిచిపోతుందని 16వ వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని తెలిపారు. ముఖ్యంగా రాజకీయాలలో యువతకు ప్రాధాన్యాన్ని మంత్రి వాకిటి శ్రీహరి తొలినాళ్లలోనే గుర్తించారని, అందుకే ముఖ్యంగా యువతకు దాదాపు 10 ఏళ్ల నుంచి కీలకమైన మండల అధ్యక్ష పదవులను కట్టబెట్టారని గుర్తు చేశారు. అప్పటినుంచి యువతకు పెద్దపీట వేస్తూ వస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, తాజాగా సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేసిన యువతకు 21 ఏళ్లకే చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలనే సూచనను మంత్రి వాకిటి శ్రీహరి నూటికి నూరు శాతం సమర్థిస్తున్నారని, దాంతో పాటు ఇప్పటికే ఆచరణలో సైతం పెట్టి, స్థానిక సంస్థల్లో మున్సిపాలిటీలలో యువతకు పెద్దపీట వేశారని తెలిపారు.

ఈ సందర్భంగా తనలాంటి యువతకు అవకాశం కల్పించి, చట్టసభల్లో పోటీ చేసి, మున్సిపాలిటీలో ప్రాతినిధ్యం వహించేలా సహకరించిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. తనలాంటి ఎంతోమంది యువత.. మంత్రి వాకిటి శ్రీహరి గారి అడుగుజాడల్లో నడుస్తూ ఎన్నో కీలక పదవులు పొందారని, రాబోయే రోజుల్లో యువతకు మరిన్ని పదవులు మంత్రి వాకిటి శ్రీహరి మార్గదర్శకత్వం అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అమరవాయిలో సీఎం

## రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ.. బాధితుడికి ఆర్థిక భరోసా



**మనోపాడు, జులై26(జనంసాక్షి):**

అమరవాయి గ్రామానికి చెందిన తెలుగు మోహన్ గారికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును డీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సిరాజ్, అమరవాయి గ్రామ సర్పంచ్ పి. హుస్సేన్, జల్లాపురం సర్పంచ్ వజ్రా గారు కలిసి అందజేశారు.

## సమస్యను మెదక్

## ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పలితం శూన్యం...!!

- మేము ఎట్లా బతకాలని ఉద్యోగుల అవేదన...?





**మెదక్ టౌన్ జులై 26, (జనంసాక్షి):** మెదక్ జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న స్లీపర్, కంప్యూటర్ ఆపరేటర్లకు గత రెండు సంవత్సరాల నుండి జీతాలు లేక పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది.గత ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు కంటిన్యూషన్ ఆర్డర్ రాలేదు.దీనితో రెండు సంవత్సరాల నుండి మేము ఖాళీగా ఉంటూ కూలీ నాలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నట్లు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు (జనం సాక్షి) విలేకరులతో వెల్లడించారు. మేము విధులు నిర్వహించలేక,జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

ఇప్పటివరకు పని చేసిన జీతాలు ఇవ్వలేదనీ,ఇది ఏంటి సార్ అని అడగగా జిల్లా డిస్టిక్ ఫైర్ అధికారి వేణు,2024-2026 ఆర్థిక శాఖ నుంచి కంటిన్యూస్ ఆర్డర్ రాలె అని బదులు ఇచ్చినారనీ వెల్లడించారు. ఇదే విషయయాన్ని మెదక్ ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లినా ఫలితం లేదని వారు ఆరోపిస్తున్నారు. మాలాంటి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేసారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే పట్టించుకునే నాథుడు కరువైనాడనీ,

మా సమస్యలకు పరిష్కరించి పెండింగ్ లో ఉన్న 2024-2026 సం.నుంచి రావాల్సిన జీతాలు,కంటిన్యూషన్ ఆర్డర్స్ఇప్పించాలని కోరుతున్నారు.మా ఔట్ సార్సింగ్ ఉద్యోగుల ఆవేదనమ పట్టించుకుని మాకు న్యాయ చేయాలని వారు వేడుకున్నారు.